సిగ్గు

తేకుమళ్ళ రామచంద్రరావుగారు, ఎం.యే., బి.యల్.

రమణరావు తనగదిలో పందిరిపట్టెమంచముపై కూరుచుండెను అతనిముఖము విచారమును, నొకవిధమగు విసుగును సూచించుచుండెను "జీవితములో మాధుర్యమున్నది కాని—"అను వాక్యమునందలి భావము తు, చ, తప్పకుండ ఆతనివదనమండలమున సుచిత్రితమై యుండెను

రమణరావుగదితలుపు మూసియుండెను ఆగదిలో నాతఁడుదప్ప నింకెవ్వరును లేరు ఆతఁడు పందిరిపట్టె మంచముపై గూరుచుండి ఎడమపాదమును నేలమీదను కుడిపాదము నేలకుకొంచెమెత్తుగను పెట్టుకొని యుండెను మంచమున కెదురుగనున్న నిలువుటద్దములో నాతనిమూర్తి కనబడుచునేయుండెను కాని రమణరావు అద్దమువంక చూచుటలేదు ఆతనికన్నులు మాత్రము నేలవైపునకు తిరిగియుండెను కాని ఆ కన్నులు దేనినికూడ చూచుచుండుటలేదు ఆతని ఆత్మగతమై విచారసమ్మిళితమై యేభావముకలదో ఆభావ మాతని సంపూర్ణముగ వశ్యముచేసికొని యుండెను.

ఆకసమును గ్రమ్మినమేఘములను ప్రచండవాయువు చిమ్మివైచి గగనమును తేజోవంతముగ నొనర్చును. అటులే యెట్టకేలకు రమణరావు తన మనోవీధిని క్రమ్ముకొన్న విచారము నొక్కనిట్టూర్పుతో తాత్కాలికముగ విదళించిలేచెను

"అబ్బే, దానికి తోచాలిగాని ఒకళ్లుచెపితే తెలుస్తుందా! మనస్సులో లేనిది చెపితేమట్టుకు ఎక్కడనించి వస్తుంది!"

ఈమాటలు తనలోతానేయనుకొని దిటవుబూని కండువా తనభుజములమీదవైచికొని పాదరక్షలను తొడిగికొని రమణరావు బయలుదేరియెచ్చటికో వెడలెను.

* * *

రమణరావు బయలుదేరిన నాలుగైదునిమిషములకు రాధ ఆగదిలో ప్రవేశించెను. రాధ పదునాఱు పదునేడేండ్లబాలిక, రమణరావుభార్య ఆమె కాపురమునకువచ్చి సుమారొకసంవత్సరమైనది అప్పుడే ఆమె జడవైచుకొని ముఖము సబ్బుతోరుద్దుకొని, చక్కగతుడిచికొని చాదుచుక్క పెట్టుకొన్నది. చాదుచుక్క పెట్టుకొన్నచేతిని కడుగుకొనుచుండగ రమణరావు వెడలుటను ఆమె చూచినది. ఆపిమ్మట ముఖము కడుగుకొనుటచేత రేగిన ముంగురులను దువ్వెనతో దువ్వుకొని తెల్లనిచీరకట్టుకొన్నది రమణరావు లేఁడుగదా అన్నధైర్యముతో గదిలోఁబ్రవేశించినది.

గదిలో మాత్రమేమున్నది? ఆమెకు ప్రాణప్రియుఁడగు రమణరావులేఁడు ఆతఁడులేనిదే ఆమెకేమి తోచగలదు? రాధ కొంతసేపాగదిలో తారట్లాడినది. నిలువుటద్దము దగ్గరనిలిచి తనయందమును మువ్మారు చూచుకొన్నది. గదిలో బల్లమీద సరిగ నమర్చబడియే యున్న పువ్వులనుతీసి మఱల నమర్చినది పందిరిపట్టెమంచముమీద కూర్చున్నది. ఏమితోచినదో కాని దిగ్గనలేచినది.

రాధ గబగబ హార్మోనియము పెట్టెదగ్గరకువెడలి, పెట్టెమూతతీసినది క్రింద చాపవైచికొని పెట్టెలోని హార్మోనియమును చాపమీదపెట్టుకొని పాటలు మొదలుపెట్టినది ఇట్లు కొంతసేపైనతరువాత రమణరావుతమ్ముఁడు తొమ్మిదిపదేండ్ల బాలుఁడు అచ్చటికి వచ్చినాఁడు రాధ పాడుచునేయున్నది. ఆపాట ముగియగనే రాధ హార్మోనియమును పెట్టెలోపెట్టివేయబోయెను.

"ఇంకోపాట పాడుదూ, వదినా!"

"ఒద్దమ్మా, మళ్ళీ అమ్మకి కూరతరిగియ్యాలా మరి"

"అబ్బా ఒక్కపాటపాడితే అరిగిపోతావు గాబోలు లెద్దూ?"

"మళ్ళీనాన్నా, అన్నయ్యారారూ? ఇంకానంట కాలేదా, అంటారు"

"మరీ; అన్నయ్యనుచూస్తే నీకుభయమా?"

రాధ తనలోతానునవ్వుకొన్నది ఆబాలుఁ డిది చూచినాఁడు

"చెపుతాలే, అన్నయ్యతో, నువ్వు హార్మోనియం వాయించావని"

అని ఎగురుచు గంతులువైచుచు బాలుడు పరుగెత్తెను.

* * *

రాత్రి ఏడుగంటలన్నరయైనది రాధ మామగారు క్లబ్బునుండి వచ్చినారు తరువాత నైదునిమిషములలో రమణరావువచ్చి కాలుసేతులు కడిగికొనెను తండ్రియు, కుమారుడును భోజనమునకు కూరుచుండిరి

ఇంతలో నంతకుముందే భోజనముచేసిన రమణరావు తమ్ముడచ్చట ప్రత్యక్షమయ్యెను. ఆతఁడు వదినదగ్గరకు పోయెను

"చెప్పనా? చెప్పనా?"

రాధ చిరునవ్వునవ్వి యూరకొనెను బాలుఁడు సంబరముపడుచుండెను. ఇదిచూచి రాధమామగారు ఇట్లనిరి·

"ఏమిటిరా, అడావిడి?"

"వదిన హార్మోనియం వాయించింది"

"దీనికేనా? వచ్చును, వాయించింది"

బాలుఁడు రమణరావు ముఖమువంకజూచెను. ఆతనిముఖ మానందమును సూచించుచుండెను కాని యుత్తరక్షణమున విచారసమ్మిళితమైన యొకరకపు విసుగెప్పటివలె నాతని ముఖరంగమున తాండవించుచుండెను

* * *

రాత్రి తొమ్మిదిగంటలన్నరయైనది రమణరావు తనగదిలో కుర్చీమీదకూరుచుండియుండెను. ఎదుట దీపము వెలుగుచుండెను. సాధారణముగ నాతడేనవలనో, లేక పత్రికనో, మరిదేనినో చదువుకొనుచుండెడివాఁడు నాఁడాతఁడట్టిపని యేదియు చేయుచుండుటలేదు ఆతఁ డేవోదీర్ఘాలోచనలలో మునిగియున్నట్లు కనఁబడుచుండెను

"ప్చ్. దానికి నామీదప్రేమలేదు ఉంటే యిలా చేస్తుందా? ప్రేమలేనిచోట వృధాగా నాప్రేమ నే నెందుకు ధారపోయాలి?"

రమణరావు మఱల ఆలోచించెను

"పాపము దానికేమి తెలియదు. తెలియనిదానికి చెప్పాలిగాని, దానిమీద ఊరికే కోపంతెచ్చుకోడం పొరబాటు"

ఏసమాధానమును రమణరావునకు సంతృప్తికరముగనుండలేదు ఇట్టిస్థితిలో రాధ గదిలో ప్రవేశించెను. తలుపు గడియవైచెను రమణరావు దగ్గరకు వచ్చి నిలువబడెను

రమణరావేమియు మాటాడలేదు ఇన్నిదినములనుండియు తానువచ్చుటతోడనే ప్రేమతో సంబోధించు ప్రాణకాంతుఁడు నేడిట్లెందుకు మారిపోయినాఁడు? కారణమేదియు నామెకుగోచరించలేదు.

"ఇవ్వాళపత్రిక చదువుకోలేదేం?"

రమణరావు మాటలాడలేదు.

"ఏమిటాలోచిస్తున్నారు? నాతో చెప్పండి అదేమిటోను"

"ఏదైతే నీకెందుకు? నీసంతోషం నువ్వు అనుభవిస్తున్నావుగా? నామాట నీకెందుకు?"

"చూశారా! చూశారా! మరి, నామీదకోపం తెప్పించుకున్నారు. నేనేంజేశానమ్మా?"

"నువ్వేంజేశావు! నువ్వేమీచెయ్యలేదు నువ్వేం జేశావన్నాను?"

"నేనేంసంతోషం అనుభవించాను"

"నీయిష్టంవచ్చిన సంతోషం అనుభవించు, నేనొద్దన్నానా?"

"అదంతా కాదు అలా చెపితే నాకు తెలియదు నామీదమీకు కోపంవచ్చిందా?"

"కోపంలేదు, కోరికీలేదు"

"ఏమిటమ్మా ఈమాటలు?"

"అమెరికాలో ఐదేళ్ళకంటే యెక్కువకాలం భార్యాభర్తలు ఒకరినొకరు ప్రేమించుకోరుట మన దేశంలో ఏడాదికంటే ఎక్కువకాలం ప్రేమించుకోరులాఉంది"

"అయితే, నేనంటే మీకిష్టంపోయిందా?"

"నీకే నామీద ఇష్టంపోయింది."

"మాయమాటలు చెపుతారు, అన్నీని"

"మాయమాటలుకాదు నిజమే అంతా నాకు స్పష్టంగా కనిపించడంలేదా?"

"పోనీ నామీదకోపం ఎందుకు వచ్చిందో చెప్పండి."

"నేను నిన్న మధ్యాహ్నం హార్మోనియం వాయించమన్నానా?"

"అన్నారు"

"వాయించావా?"

"ఎలా వాయించేదమ్మా మరి?"

"సాయంత్రం ఎలావాయించావు?"

"అదికాదు మీరు పరీక్షలూ, అన్నీవ్యాసై యిలా అంటే నేనేంజెప్పేదీ మరి? మధ్యాహ్నం వాయించమంటే మామగారింటోవున్నారా? మామగారు వినేలాగు వాయించేదా? చెప్పండి"

"నీకు హార్మోనియంవాయించడం వచ్చునని మామగారికి తెలియదుగాబోలు"

"తెలిస్తేమాత్రం వాయించేదా? అందరూ ఏమంటారు?"

"ఏమంటారు? ఏమీఅనరు ' ఎందుకంటారు?"

రాధ మాటాడలేదు రమణరావామెవంకc జూచెను ఆమెను దగ్గరకు తీసికొనెను రాధ రమణరావు నెంతపవిత్రముగ గాఢముగ ప్రేమించుచుండెనో రమణరావుగూడ రాధనట్లే ప్రేమించుచుండెను

"మీకేం? మీరు మొగవాళ్ళు ఎవరన్నా అంటే నన్నంటారుగాని మీకేం?"

"అందుకే నువ్వు హార్మోనియం వాయించుకొని సంతోషం అనుభవించు, నాసంతోషంమాట నీకెందుకు? అన్నాను"

"ఒక్కటి చెప్పండి. మీసంతోషంమాట నాకక్కరలేదని మీరు మనస్ఫూర్తిగా నమ్ముతారా?"

"మధ్యాహ్నం నాకేమీతోచక శలవలవడంచేత ఏమీతోచక నీతో కబురులాడుదామని నిన్ను రమ్మన్నానా?"

"అత్తగారూ, మామగారూ పెద్దవాళ్ళుంటే వాళ్లకెదురుగుండా నేను మీతో రాచకార్యంచెయ్యడానికివచ్చేదా?"

"ఏమీ? తప్పా?"

"తప్పేమరి అందరూ ఏమనుకుంటారు? ఇదేమిటి? బోగంవానిలాగుఅనుకోరూ?"

"మొగుడితో మాట్లాడడానికిగాదూ మరి పెళ్లిచేసుకున్నది?"

"అయితే ఎప్పుడూ ఎదురుగుండా కూర్చుంటారా?"

"ఎప్పుడూ కూర్చోమన్నానా?"

రాధ కొంతసేపు మాటలాడలేదు

రమణరావామెవంకజూచుచు కూరుచుండెను రాధ వదనమండలమున నేదియో యొకదివ్యజ్యోతి ప్రకాశవంతమయ్యెను

"అయితే మీసంతోషమంతా నేను చెడగొట్టేశానా?"

ఈమాటలందలి పరిపూర్ణమును, మంజులమునునగు విచార మాతనిమనస్సును వశముచేసికొనెను రమణరావామెను దగ్గరకుతీసికొని తనవ్రేళ్లతో నామె ముంగురులను సరిచేయుచుండెను

"అయితే యిప్పుడు హార్మోనియం వాయించమంటారా?"

ప్రేమతో నిండియున్న రమణరావు కంఠబిలము నుండి ఈ క్రిందిమాటలు నిర్గమించెను

"వాయించు"

"అయితే సరే"

రాధ రమణరావుదగ్గరనుండి హార్మోనియంపెట్టె కడకు వెడలిపోబోయెను రమణరా వామె చేతిని వదలిపెట్టలేదు.

"వాయిస్తే నీకు సిగ్గుగా ఉంటుందా?"

"నాకుసిగ్గూలేదు, ఏమీలేదు, మీరెలా చెయ్యమంటే అలా చేస్తాను"

"ఇకనెప్పుడూను, నేను పిలిచినప్పుడువస్తావా?"

"వస్తాను"

"నీకు సిగ్గువెయ్యదూ?"

"వెయ్యదు"

"నిజంగా?"

"అవును"

రమణరావాలోచించెను.

"నువ్విప్పుడు హార్మోనియం వాయించొద్దు."

"సరే"

"రేపుమధ్యాహ్నంవాయించు"

"అలాగే"

"రాధా! నీదగ్గిర యివ్వాళ ఒకపాఠం నేర్చుకున్నాను ఆడవాళ్ళకు సహజంగా సిగ్గుంటుంది కాదూ?"

"సిగ్గులేకపోతే అసలు ఆడజన్మ ఎందుకు?"

"ఆసిగ్గును చంపివేస్తే, ప్రేమలోమాధుర్యమే చచ్చిపోతుంది. ఎండిపోయిన చెరుకుముక్క ఎంతో అప్పుడా ప్రేమ అంత అమెరికాలోని ప్రేమ ఉన్నదే అది మాధుర్యవిహీనమైన ఎండిపోయిన చెరుకుముక్కలాంటి ప్రేమ"

"వాళ్ళది ప్రేమకాదు, మోహము అరక్షణముంటుంది, క్షణముంటుంది మహా ఉంటే ఐదేళ్ళుంటుంది."

"మన ప్రేమో?"

"ఒకమాటు భార్యాభర్తా అయితే పదునాలుగు జన్మాలదాకా మళ్ళీమళ్ళీ భార్యాభర్తా అవుతారట"

రాధగాని, రమణరావుగాని కొన్నినిముషములు మాటలాడలేదు వారిరువురును నేదియో ఆలోచించుచుండిరి తుదకు రమణరా విట్లనెను

"నిన్ను రేపటినించీ మధ్యాహ్నం రాచకార్యానికిపిలవను. గాటమైన కోరికఉంటేకాని ఏఅనుభవంలోనూ సంతోషంఉండదు అస్తమానం నీతో సంతోషము అనుభవిస్తూనేఉంటే నీమీదవిరహమేఉండదు. విరహంఉండకపోతే కోరికేఉండదేమో? కోరికలేని అనుభవంలో సంతోషం ఎంతమాత్రమూ ఉండదు"

* * *

"అయితే నామీద కోపంలేకుండా ఉంటారా?"

"ఎందుకుండనూ?"

ప్రియతమా!

చేబ్రోలు సూరన్న గారు

చిత్రకారుఁడనౌదునా? చిత్తమార
మంజులత్వదీయానూనమధురమూర్తి
నీసకలభువనైకవిలాసగతుల
హృదయపుటపైని చిత్రించుకొందు.
కవికుమారుఁడనౌదునా? కాంక్షదీర
తావకీనకళ్యాణలీలావిశేష
ములను భువనాలుతలలూప మోహనముగ
జీవితమె గీతములగ రచించుకొందు

గాయకాగ్రణినౌదునా? కఱవుదీర
హృదయరంజకమైన నీమధురనామ
కీర్తనము శిలలెకరఁగ పృథివినెల్ల
నిత్యమును జీవితాంతము నింపివైతు.